
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
3
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 21 జూలై 2025



ఘనంగా అంతర్జాతీయ చదరంగ దినోత్సవం



పెద్ద బోర్డులో చదరంగం ఆడుతున్న క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చదరంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఏ1 చెస్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో భారీ చదరంగం బోర్డును ఆవిష్కరించారు. ప్రపంచ చదరంగ సమాఖ్య 101వ చెస్ దినోత్సవాన్ని 'ఎవరీ మూవ్ కౌంట్స్' అనే నినాదాన్ని తీసుకువచ్చిందని సీనియర్ కోచ్, రాయలసీమ మొదటి ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్‌నాయుడు తెలిపారు. చదరంగం మేధో వికాసానికి, క్రమశిక్షణ, ఏకాగ్రతకు దోహదం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మైదానంలో ఏర్పాటు చేసిన అతిపెద్ద చదరంగం బోర్డు ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ ఛైర్మన్ బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి కిశోర్‌నాయుడు, సీనియర్ ఆర్బిటార్ గోవిందరాజులు, ఏ1 చెస్ అకాడమీ కోచ్‌లు విజయ్‌కుమార్, మెహరాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

తెగులు.. దిగులు..!

టమోటా పంటకు మచ్చ

తుడిచి పెట్టుకుపోతున్న తోటలు

తీవ్రంగా నష్టపోతున్న రైతులు

5



చుక్కలు చూపిస్తున్నారు..!

ముడుపులిస్తేనే ఎన్‌ఓసీలు

ఫైల్‌ను బట్టి రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు..

తహసీల్దార్ వయా ఆర్డీఓ ద్వారా కలెక్టరేట్ వరకు ఇదే పరిస్థితి

5వేలకు పైగా పెండింగ్‌లో చుక్కల భూములు

22ఏ ఫైల్స్‌లోనూ అదే దుస్థితి.. మధ్యవర్తుల ద్వారా వ్యవహారం



కలెక్టరేట్

అనంతపురం కలెక్టరేట్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌ఓసీ) కావాలంటే ఆషామాషీ కాదు. ప్రభుత్వ అధికారులతో పూర్తయ్యే ఈ ఎన్‌ఓసీ ప్రక్రియకు మధ్యవర్తులు వ్యవహారం నడుపుతున్నారంటే.. బేరసారాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. చుక్కల భూమి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత ప్రజలు, రైతులు కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రధానంగా చుక్కల భూములు, 22ఏ పరిధిలోని భూములకు సంబంధించిన ఫైల్స్ ఎన్‌ఓసీ కోసం వెళ్తాయి. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం ద్వారా చేరాలి. అక్కడ ఫైనల్ సంతకం పూర్తయితే ఆ భూమికి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశముంటుంది. ఈ తతంగం అంత సులభంగా జరగడం లేదు. ఒక్కో కార్యాలయంలో నాలుగు నుంచి ఆరునెలలకు పైగా మూలుగుతున్నాయనే విమర్శలున్నాయి. వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యే ఫైల్స్ తిరిగి తహసీల్దార్ కార్యాలయానికి రావడానికి రెండేళ్లు పడుతోంది. ఇక ఆ ఫైళ్లు వేగంగా కదిలి ఎన్‌ఓసీ చేతికి రావాలంటే ముడుపులు ముట్టజెప్పాలి. దీంతో సామాన్యులు డబ్బులు చెల్లించుకోలేక, కార్యాలయాల చుట్టూ తిరగలేక అలాగే వదిలేసుకుంటున్నారు.


రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు....

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్‌ఓసీ పూర్తయిన ఫైల్స్ 30లోపే ఉంటాయని రెవెన్యూ శాఖ వర్గాల సమాచారం. 'చుక్కల భూములు, 22 ఫైల్స్ ముందుకు కదలాలంటే మీకు రెకమెండేషన్ చేయాలి.. లేదా మిమ్మల్ని సంతృప్తి పరచాలా...?' అని స్వయంగా

(మిగతా 5లో..)

వేల సంఖ్యలో పెండింగ్,...

కూడేరు మండలం కమ్మూరుకు చెందిన ఓ రైతు 16ఎకరాలకు సంబంధించి ఎన్‌ఓసీ కోసం ప్రయత్నిస్తున్నాడు. 22ఏ కింద ఉన్న ఆ భూమి కోసం 2018 నుంచి విఫలయత్నం చేస్తున్నాడు. సబ్ డివిజన్ మ్యాప్ పెట్టి పంపమని కలెక్టరేట్ నుంచి పంపారు. కానీ ఇంత వరకూ ఆ ఫైల్ ఎక్కడుందో తెలియడం లేదట. ఆ ఫైల్ కోసం ఆ రైతు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. ఇలాంటి ఫైల్స్ వేల సంఖ్యలో ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 32 మండలాలున్నాయి. తహసీల్దార్ కార్యాలయం నుంచి వెళ్లాల్సిన సంబంధిత ఫైల్స్ ఎక్కడికక్కడే పెండింగ్‌లో ఉంటున్నాయి. ఆర్డీఓ కార్యాలయాల్లో పరిశీలించాక కలెక్టరేట్‌కు పంపాలి. ఇలాంటి వాటిలో 22ఏ ఫైళ్లు వందల సంఖ్యలో, చుక్కల భూములు వేల సంఖ్యలో ఆర్డీఓ కార్యాలయాల్లో ఉంటున్నాయి. అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో 22ఏ ఫైళ్లు 161, చుక్కల భూములు 3వేలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. కళ్యాణదుర్గంలో ఆర్డీఓ కార్యాలయంలో 130వరకు 22ఏ ఫైళ్లు, 1020 వరకు చుక్కల భూముల ఫైళ్ల పరిస్థితి అలాగే ఉంది. గుంతకల్లు డివిజన్‌లో 80కు పైగా 22ఏ ఫైల్స్, 800 వరకు చుక్కల భూములు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక తహసీల్దార్ కార్యాలయాల గురించి చెప్పుకోవడం దండగ.



హనుమా.. పాలకులేరీ..?

6 ఏళ్లుగా పాలకవర్గం లేని నేమకల్లు ఆలయం

కుంటుపడుతున్న అభివృద్ధి

పట్టించుకోని దేవదాయ శాఖ



నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయం

బొమ్మనహాళ్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయానికి ఆరేళ్లుగా పాలకవర్గం లేక అభివృద్ధి కుంటుపడుతోందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో పాలకవర్గ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తులు కూడా స్వీకరించారు. అయితే అప్పట్లో ఓ నాయకుడి సూచనతో పెండింగ్‌లో పెట్టారు. అంతే. అప్పటి నుంచి ఇప్పటి వరకు పాలకవర్గం ఏర్పాటు ఊసేలేదు.

పెత్తనం కోసం మోకాలడ్డు

వైసీపీ పాలనలో ఓ నాయకుడు పెత్తనం కోసం పాలకవర్గం ఏర్పాటు కాకుండా అడ్డుపడినట్లు విమర్శలు ఉన్నాయి. ఆరేళ్లుగా పాలకవర్గం లేక పోవడంతో ఆలయ నిర్వహణ, అభివృద్ధి కుంటుపడుతోంది. ఏటా శ్రావణ, కార్తీక మాసాల్లో నేమకల్లు దేవాలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో ఈఓ, సిబ్బందితో దేవాలయాన్ని నిర్వహించడం కష్టంగా మారుతుంది. ప్రస్తుత ఈఓ రాయదుర్గం, మురిడి, నేమకల్లు దేవాలయాలు బాధ్యతలు చూస్తున్నారు. పని ఒత్తిడితో ఏ ఆలయంపైన కూడా పూర్తి దృష్టి పెట్టలేకపోతున్నారు. దీంతో పండుగలు, విశేష సందర్భాల్లో ఆలయానికి వచ్చే భక్తులకు సరైన సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఆలయంలో భక్తులు వేసిన కానుకలు, హుండీ ఆదాయంపై ఉన్న శ్రద్ధ పాలకవర్గం ఏర్పాటుపై దేవదాయశాఖకు లేదని భక్తులు మండిపడుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యి ఏడాది పూర్తి అయిన ఇప్పటి వరకు పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారంలో నోటిఫికేషన్

వారం, పది రోజుల్లో నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయ పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల అవుతుంది. నోటిఫికేషన్ విడుదల అయిన తర్వాత పాలకవర్గం ఏర్పాటు చేస్తాం. రెండేళ్ల కిందట నేను ఇక్కడ ఈఓగా బాధ్యతలు తీసుకున్నా. నేను వచ్చినప్పటి నుంచి పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్ రాలేదు. పాలకవర్గం లేకపోయినా వీలైనంత వరకు భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

-నరసింహారెడ్డి, ఈఓ, రాయదుర్గం గ్రూపు ఆలయాలు



భక్తజన సందోహం నడుమ బీబీ ఫాతిమా పీరు అగ్నిగుండ ప్రవేశం

జలధికి తరలిన బీబీ ఫాతిమా పీర్లు

అనంతపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): బీబీ ఫాతిమా పీర్లుకు జలధికి తరలి వెళ్లాయి. స్థానిక ఐదో రోడ్డులో నిర్వహిస్తున్న బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బీబీ ఫాతిమా పీర్లు జలధికి తరిలాయి. ఉదయం పురవీధుల్లో పీర్లను ఊరేగించి అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం భక్తులు పెద్దఎత్తున హాజరై చక్కెర చదివింపులు చేశారు. సాయంత్రం హెచ్చెల్సీ కెనాల్‌లో సంప్రదాయబద్ధంగా జలధి నిర్వహించారు. మంగళవారం ఉదయం బీబీ ఫాతిమా పీరు చివరి దర్శనం, సాయంత్రం భక్తులకు అన్నదానం చేసి బ్రహ్మోత్సవాలను ముగించనున్నట్లు బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున వెల్లడించారు. కార్యక్రమంలో బ్రహ్మోత్సవ నిర్వాహకులు నరసింహులు, కేఎస్ మురళి, కిశోర్, మహేష్, చంద్రశేఖర్, అజ్జి, తిమ్మప్ప పాల్గొన్నారు.



పీర్ల జలధికి భారీగా హాజరైన భక్తులు

మిథున్‌రెడ్డి అరెస్టుతో వారి ఆత్మకు శాంతి

- వైసీపీ హయాంలో కల్తీ మద్యానికి ఎందరో బలి
- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



గుల్జార్‌పేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుతో గత ఐదేళ్లల్లో కల్తీ మద్యం తాగి చనిపోయిన వారి ఆత్మలు శాంతిస్తాయని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం 18వ డివిజన్ పరిధిలోని గుల్జార్ పేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా ఇంటింటికీ తిరిగి ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నగరంలో తాను అభివృద్ధి చేస్తుంటే.. మాజీ ఎమ్మెల్యే, మేయర్ విమర్శలు చేస్తున్నార అన్నారు. గత ఐదేళ్లల్లో నాసిరకం మద్యం విక్రయాలతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడానికి వైసీపీ నాయకులే కారణం అన్నారు. నాసిరకం మద్యంతో మహిళల తాళిబొట్లు తెంచిన కర్కశులు వైసీపీ నాయకులని మండిపడ్డారు. మిథున్‌రెడ్డి అరెస్టుతో బాధిత కుటుంబాలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ముస్తాక్, ఖలందర్, హసీనా, సికిందర్, సరిపూటి రమణ, సుధాకర్ యాదవ్, నూర్ మహ్మద్, నాగన్న, సంగా తేజస్విని, చేపల హరి, లక్ష్మీనరసింహ, బాలాంజనేయులు, బాబాఫక్రుద్దీన్, సాలార్ బాషా, వడ్డే భవానీ, రమాదేవి పాల్గొన్నారు.

13 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 13 మండలాల్లో శనివారం రాత్రి వర్షం పడింది. అత్యధికంగా అనంతపురం నగరంలో 22.8 మీ.మీ వర్షపాతం నమోదయింది. విడపనకల్లు 22.2, కుందుర్పి 19.6, బ్రహ్మసముద్రం 12.2, అనంతపురం రూరల్ 10.2, పెద్దపప్పూరు 9.6, గార్లదిన్నె 7.6, కూడేరు 7.2, రాప్తాడు 6.0, బుక్కరాయసముద్రం 3.2, గుంతకల్లు 2.2, బెళుగుప్ప 1.8, యాడికి 1.6 మీ.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. యాడికిలో ఓ మోస్తారు వర్షం పడింది. అనంతపురం, శింగనమల, పుట్లూరు, గుత్తి తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి.

జేసీ ప్రభాకర్ రెడ్డిపై కేసు నమోదు

తాడిపత్రి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన చంద్రబాబు రీకాలింగ్ ప్రోగ్రాం సందర్భంగా ఇరుపార్టీల నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు కేసులు నమోదు చేశామని పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. టీడీపీ తరఫున మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎస్వీ రవీంద్రారెడ్డితోపాటు మరికొంతమంది, వైసీపీ తరఫున బ్రహ్మానందరెడ్డి, ఓబులరెడ్డి, జిలాన్‌బాషాతోపాటు మరికొంతమందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.



మురుగు, వర్షపు నీటితో మడుగును తలపిస్తున్న కొడిమిలోని వీధి

నడి ఊరులో నీరు

ఇళ్ల నుంచి వచ్చేందుకు అవస్థలు

రాకపోకలకు వాహనదారుల తిప్పలు

కొడిమిలో మడుగు..!

అనంతపురంరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఊరు నడి మధ్యలో ఒక వైపు మురుగునీరు, మరోవైపు వర్షపు నీరు నిలుస్తుండడంతో జనం ఇంటి నుంచి బయటకు రాలేక అవస్థలు పడుతున్నారు. అనంతపురం రూరల్ మండలంలోని కొడిమి గ్రామ ప్రధాన రోడ్డు మడుగును తలపిస్తోంది. వర్షపునీరు, మురుగునీటితో స్థానికులు, వాహనదారుల అవస్థలు వర్ణతీతంగా మారాయి. వాహనదారుల రాకపోకలు సాగించేందుకు తిప్పలు పడుతున్నారు. అసలే మురుగు నీటి తో ఇబ్బందులు పడుతుంటే శనివారం రాత్రి కురిసిన వర్షానికి కష్టాలు మరింత ఎక్కువయ్యాయని స్థానికులు, వాహసదారులు వాపోతున్నారు. నగరం నుంచి నరసనాయనికుంట, మర్తాడు, కోటంకకు నిత్యం రాకపోకలు రాకపోకలు సాగిస్తున్నారు. కొడిమిలోకి రాగానే ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా మురికి నీటి స్నానం చేయాల్సిందే. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలో ఆదివారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించినప్పుడు అక్కడి దుస్థితి కళ్లకు కట్టినట్లు కనిపించింది.

మురుగు, వర్షపు నీరు వెళ్లేందుకు దారేదీ..?

కొడిమి నడి ఊరిలో మడుగును తలపించడానికి ప్రధాన కారణం వర్షపు నీరు, మురుగు నీరు వెళ్లేందుకు వీలు లేకపోవడమే. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వెనుక భాగంలో నుంచి పొలాల మీదుగా మురుగు వెళ్లాల్సి ఉంది. మొదట్లో అధికార పార్టీ నాయకుడి ఇంటి నుంచి తన పొలం దిగువ ఉన్న పొలాల మీదుగా మురుగు నీరు వెళ్లాల్సి ఉంది. దిగువన వైసీపీ నాయకులకు సంబంధించిన భూములు ఉండడంతో కాలువ తీయడానికి ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకుడికి సంబంధించిన భూమిలో మాత్రమే కాలువ తీసి వదిలేశారు. రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉండటంతో సమస్య వస్తోందని సదరు టీడీపీ నాయకుడు ఇటీవల తన ఇంటి వద్ద కాలువను పూర్తిగా పూడ్చేశాడు. దీంతో మురుగునీరు ముందుకు వెళ్లేందుకు వీలు లకుండా పోయింది. దీంతో గ్రామంలోని ప్రధాన రోడ్డుపై నీరు చేరుతోంది. దీనికితోడు శనివారం రాత్రి కురిసిన వర్షానికి సమస్య మరింత ఎక్కువైంది. మోకాలిలోతు నీటితో ప్రధాన రోడ్డు మడుగును తలపిస్తోంది. మురుగు నీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టడమే సమస్యకు శాశ్వత పరిష్కరమని గ్రామస్థులు అంటున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లు సమస్య పరిష్కరించకుండా వదిలేశారని, ప్రస్తుత పాలకులయినా శాశ్వత పరిష్కరం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.





మురుగునీటిలో వాహనదారుల అవస్థలు

ఊరి బడి ఉసూరు..!

- ప్రైమరీ స్కూళ్లకు గడ్డుకాలం
- వెంటాడుతున్న వైసీపీ ప్రభుత్వ విధానాలు
- జిల్లాలో 222 ఏకోపాధ్యాయ పాఠశాలలు
- ప్రశ్నార్థకంగా మనుగడ

ఊరంతా నిశ్శబ్దంగా ఉన్నా..
బడి వద్దకెళ్తే మాత్రం..
గోలగోలగా ఉండేది..
పిల్లల అల్లరితో
ఆ ప్రాంతమంతా
సందడిగా ఉండేది..
బడి గంట కొడుతుండగానే
పిల్లలు పరుగున వెళ్లేవారు..
ఇంటర్వెల్ వదిలితే..
గుంపులుగా కనిపించేవారు..
పాఠశాల వదలగానే..
కేరింతలు కొడుతూ వెళ్లేవారు..
అలాంటి బడి..
పిల్లలు లేక ఉసూరుమంటోంది..
అది పాఠశాలేనా..
అన్న అనుమానం తలెత్తుతోంది..




కొత్తచెరువు మండలం మైలేపల్లిలోని ఏకోపాధ్యాయ పాఠశాల

కొత్తచెరువు, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినపుడల్లా విద్యారంగంలో సంస్కరణలు అమలు చేయడం సర్వసాధారణంగా మారింది. 2020లో కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానాన్ని తీసుకొచ్చింది. అమలుకు పలు రాష్ట్రాలు వెనకడుగు వేశాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తానే ప్రపంచ బ్యాంకు నుంచి రూ.1,876 కోట్లను అప్పుగా తెచ్చుకుంది. ఈ మేరకు గత ప్రభుత్వం స్టాల్ పథకాన్ని తీసుకొచ్చి జీఓ నంబర్ 117 అమలు చేసింది. ఈ విద్యావిధానంతో అంతర్జాతీయ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రచారం చేసుకుంది. 117 జీఓతో ఏ ఒక్క బడిని మూసివేయబోమనీ, ఒక్క ఉపాధ్యాయుడినీ తగ్గించబోమని నాటి సీఎం జగన్ పలు సభల్లో చెప్పుకొచ్చారు. ఈ జీఓ వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు మూతపడే అవకాశం ఉందంటూ ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు పెద్దఎత్తున పోరాటాలు చేశారు. ఇది తమ ప్రభుత్వ పాలసీ అని మొండిగా ముందుకెళ్లారు. దీంతో 3, 4, 5 తరగతుల విద్యార్థులను సబ్జెక్టు బోధన పేరుతో హైస్కూళ్లలో కలిపేశారు. ఈ కారణంగా గ్రామాల్లోని పాఠశాలలు 1, 2 తరగతులకే పరిమితమయ్యాయి. దీంతో కొంతమంది హైస్కూళ్లకు వెళ్లగా.. మరికొందరు ప్రైవేటు పాఠశాలల బాటపట్టారు. ఈ విధానం వల్ల గ్రామీణ ప్రాథమిక పాఠశాలలు మూతపడుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి

(మిగతా 5లో...)

కణేకల్లు చెరువుకు తుంగభద్ర జలాలు



కణేకల్లు చెరువుకు చేరిన హెచ్చెల్సీ నీరు

కణేకల్లు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న శ్రీచిక్కణ్ణేశ్వర వడియార్ చెరువుకు తుంగభద్ర జలాలు ఆదివారం తెల్లవారుజామున చేరుకున్నాయి. రెండురోజులు క్రితం తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీకి నీరు విడుదల చేయగా.. శనివారం ఆంధ్ర సరిహద్దుకు చేరుకున్న జలాలు ఆదివారం తెల్లవారుజామునే చెరువుకు చేరుకున్నాయి. ఆ నీటిని అలాగే దిగువకు మరలిస్తున్నారు. సాయంత్రానికి డ్యాం నుంచి హెచ్చెల్సీకి 1557 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా.. కర్ణాటక వాటా పోనూ ఆంధ్ర సరిహద్దు వద్ద 506 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. చిక్కణ్ణేశ్వర చెరువు నుంచి దిగువకు 192 క్యూసెక్కుల నీరు వెళుతోంది. పైనుంచి వస్తున్న నీటిని ఎక్కడా నిలువ ఉంచకుండా నేరుగా దిగువకు మళ్లిస్తున్నట్లు హెచ్చెల్సీ డీఈ దివాకర్ రెడ్డి, ఏఈ నరేంద్ర మారుతి పేర్కొన్నారు. చెరువులో నీరు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భాషా పండితుల ఉద్యోగోన్నతులకు కృషి

- ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసరెడ్డి



ఆదిశేషయ్యను సత్కరిస్తున్న ఒంటేరు శ్రీనివాసరెడ్డి

అనంతపురం విద్య, జూలై 20(ఆంధ్రజ్యోతి): భాషాపండితుల ఉద్యోగోన్నతుల కోసం చేపట్టిన పోరాటంలో ఎస్ఎల్‌టీఏ (రాష్ట్ర భాషోపాధ్యాయుల సంఘం) పాత్ర ఎంతో ఉందని ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని క్రిష్ణకళామందిరంలోని రెవెన్యూభవన్‌లో ఎస్ఎల్‌టీఏ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటేరుతో పాటు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంకాలయ్య, ప్రధాన కార్యదర్శి శివానందరెడ్డి మాట్లాడుతూ.. భాషా పండితులకు అందని ద్రాక్షలా ఉన్న ఉద్యోగోన్నతుల ఫలాలు అందించడంలో ఎస్ఎల్‌టీఏ పోరాటం ఎంతో ఉందన్నారు. ఈ ఉద్యమంలో అనంత జిల్లా నేతలు ముందుండి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. టీచర్ల సమస్యల సాధన కోసం ఎస్ఎల్‌టీఏ తరఫున ముందుంటామన్నారు. జిల్లా ఎస్ఎల్‌టీఏ అధ్యక్షుడిగా పనిచేస్తూ ఇటీవల ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగోన్నతి పొందిన ఆదిశేషయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కరణం హరిక్రిష్ణ, విజయభాస్కర్, విజయలక్ష్మీ, శోభారాణి, ఎర్రిస్వామి, జయపాల్‌నాయుడు, అక్కులప్ప, గుంపు ఆదిమూర్తితోపాటు పలువురు నేతలు, టీచర్లు పాల్గొన్నారు.

దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక దూదేకుల భవనంలో దూదేకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు పగిడాల సిద్దయ్య ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సి.మస్తాన్, ప్రధాన కార్యదర్శిగా షెక్షావలి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అక్బర్, గౌరవాధ్యక్షుడిగా బ్రహ్మం, ఉపాధ్యక్షులుగా బాబయ్య, రవీంద్ర, బావాజీ, నబీరసూల్, బాబా, రాజుకుళ్లాయప్ప, దస్తగిరి, వన్నూర్‌బీ, అల్లాబకాష్, కార్యదర్శులుగా మహబూబ్ బాషా, సుభాన్, వజీర్‌బాషా, రఫీ, బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన డ్వామా పీడీ సలీంబాషా, చమన్ ఉమర్ ముక్తియార్ మాట్లాడుతూ.. విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, పిల్లల విద్యాభ్యాసం కోసం కృషి చేయాలని తెలిపారు. దూదేకుల సమాజం ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఖాసీం, మహబూబ్ సాహెబ్, రఫీ, వన్నూరప్ప, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి



రఘునాథ్ రెడ్డి, సావిత్రమ్మ దంపతులు (ఫైల్)

శింగనమల, జూలై20(ఆంధ్రజ్యోతి): మండలం మరువకొమ్మ వద్ద అనంతపురం-అమరావతి రహదారిపై ఆదివారం బైక్‌ను వెనుక నుంచి కారు అతి వేగంగా ఢీకొనడంతో దంపతులు రఘునాథ్‌రెడ్డి (60), సావిత్రమ్మ (55) మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శింగనమల మండలం గుమ్మేపల్లికి చెందిన రఘునాథ్‌రెడ్డి, సావిత్రమ్మ దంపతులు 20 ఏళ్ల క్రితం జిల్లాలోని తాడిపత్రి పట్టణానికి వలస వెళ్లారు. అక్కడ గేదెలు పెట్టుకుని, పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. గుమ్మేపల్లిలో ఉంటున్న తన పిన్నమ్మను చూడడానికి రఘునాథ్ రెడ్డి.. ఆదివారం ఉదయం భార్య సావిత్రమ్మతో కలిసి ద్విచక్రవాహనంలో గుమ్మేపల్లికి బయల్దేరాడు. శింగనమల మరువకొమ్మ వద్ద ఉన్న మలుపు వద్దకు రాగానే వెనుకవైపు నుంచి వస్తున్న కారు అతివేగంతో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో దంపతులు గాలిలో ఎగిరి పడ్డారు. రఘునాథ్‌రెడ్డికి కాలు తెగిపోయి, తీవ్ర గాయలై, అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన సావిత్రమ్మను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సావిత్రమ్మ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న శింగనమల ఎస్ఐ విజయ్‌కుమార్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బదిలీ టీచర్లకు జీతాలు చెల్లించాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న రమణారెడ్డి

అనంతపురం విద్య, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన టీచర్లకు జీతాలు అందక అవస్థలు పడుతున్నారని, వెంటనే చెల్లించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు మాట్లాడుతూ.. పొజిషన్ ఐడీలు లేవని జీతాలు ఆలస్యం చేయడం అన్యాయమన్నారు. ఇందుకు ప్రభుత్వమే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని జీతాలు చెల్లించేలా చూడాలని కోరారు. ఐఆర్ వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డీఏలు, ఆర్జిత సెలవుల నగదు బకాయిలు, మెడికల్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు సూర్యుడు, శివయ్యాచారి, సురేష్, నారాయణస్వామి, రామక్రిష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తెగులు... దిగులు..!

టమోటా పంటకు మచ్చ



తుడిచిపెట్టుకుపోతున్న తోటలు

తీవ్రంగా నష్టపోతున్న రైతులు

శెట్టూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): టమోటా రైతుకు తెగులు దిగులు పట్టుకుంది. వాతావరణ పరిస్థితుల కారణంగా పంటను మచ్చ తెగులు విపరీతంగా ఆశిస్తోంది. మచ్చ దెబ్బకు తోటలు తుడిచిపెట్టుకుపోతున్నాయి. అంతో కొంతో దిగుబడి చేతికొచ్చినా.. మార్కెట్‌లో ధర లేవు. దీంతో టమోటా రైతు దారుణంగా దెబ్బ తింటున్నాడు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట తరువాత అత్యధికంగా మండలంలో బోరుబావుల కింద టమోటా సాగు చేశారు. మొక్కలు, మందులు, కూలీల ఖర్చులు కలిపి ఎకరాకి రూ.లక్ష పెట్టుబడి పెట్టారు. కాయ దశలో నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు పంటను మచ్చ తెగులు విపరీతంగా ఆశించింది. పలు రకాల మందులు పిచికారీ చేస్తున్నా.. అదుపులోకి రావట్లేదని అన్నదాతలు వాపోతున్నారు. దీంతో మచ్చ ఏర్పడిన కాయలను రైతులు ఎప్పటికప్పుడు తొలగించేస్తున్నారు. దీంతో పంట దిగుబడి సగానికిపైగా పడిపోయింది. ఎకరాలో సాధారణంగా 200 బాక్సుల దాకా (20 కిలోలవి) దిగుబడి వస్తుంది. మచ్చ తెగులు సోకిన కాయలను పెద్ద సంఖ్యలో తొలగిస్తుండడంతో ప్రస్తుతం 100 బాక్సులు కూడా దిగుబడి రావట్లేదని రైతులు వాపోతున్నారు. వచ్చిన దిగుబడిని అమ్ముకుందామంటే మార్కెట్‌లో ధరలు నేలచూపులు చూస్తున్నాయి. బాక్సు రూ.300తో అమ్ముడుపోతున్నాయి. ఈ లెక్కన రైతుకు రూ.30 వేలు మాత్రమే వస్తోంది. పెట్టుబడి మాత్రం రూ.లక్ష పెట్టారు. వెరసి.. రూ.70 వేల వరకు నష్టం వాటిల్లుతోందని అన్నదాతలు వాపోతున్నారు. తీవ్రంగా నష్టపోతున్నా ఉద్యానవన అధికారులు.. పంటను పరిశీలించి, కనీసం సలహాలు ఇచ్చిన పాపానపోలేదని ఆవేదన చెందుతున్నారు.



మచ్చ తెగులు సోకడంతో తొలగించిన టమోటా కాయలు

పెట్టుబడి కూడా దక్కలేదు



మూడెకరాల్లో టమోటా సాగు చేశా. రూ.మూడు లక్షలదాకా పెట్టుబడులు పెట్టా. మచ్చతెగులు సోకి తీవ్రంగా నష్టపోయా. రూ.2 లక్షలకు పైగా నష్టపోయా.

-చెన్నకేశవ, టమోటా రైతు, మాలేపల్లి

తెగుళ్లు సోకి.. ధరలు లేక..



ఐదెకరాల్లో టమోటా సాగు చేశా. రూ.5 లక్షలు పెట్టుబడులు పెట్టా. తెగుళ్లు సోకి దిగుబడి పడిపోయింది. ధరలు కూడా లేక రూ.3 లక్షలు నష్టపోయా.

-రవి, టమోటా రైతు, మాలేపల్లి

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఎండ లేకపోవడం, ఆకాశం మేఘావృతంగా ఉండడంతో టమోటా పంటకు మచ్చతెగులు అధికంగా సోకింది. దీని నివారణకు క్లోరోఫిక్స్, కాపర్‌సల్ఫేట్, మాంకోజెబ్ లీటరు నీటిలో గ్రాము గానీ, స్ట్రెప్టోసైక్లిన్ 0.25 గ్రాములుగానీ కలిపి, పిచికారీ చేయాలి. రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

- గౌసియా, ఉద్యానశాఖ అధికారి

చుక్కలు చూపిస్తున్నారు..!

(3వ పేజీ తరువాయి)

కలెక్టర్ ఇటీవల జరిగిన సమీక్షలో తహసీల్దార్లపై మండిపడినట్లు సమాచారం. ఈ ఫైల్స్‌కు సంబంధించి జిల్లా స్థాయి 22ఏ కమిటీ, డీఎల్సీ సమావేశంలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మండలం నుంచి వారానికి ఒక 22ఏ ఫైల్, చుక్కల భూమి ఫైల్ తప్పనిసరిగా ఉండాలంటూ ఆదేశాలిచ్చారు. తహసీల్దార్ కార్యాలయాల్లో మూడు నెలల నుంచి ఏడాది వరకు తిప్పుకుంటున్నారు. పైసలిచ్చిన వారి ఫైల్సే ముందుకెళ్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో పరిశీలన పేరుతో మరో మూడు నెలలు ఆగుతుంది. అక్కడా ముడుపుల వ్యవహారం ముగిశాకే కలెక్టరేట్‌కు వెళ్తుంది. అక్కడ ఏ సీటు వద్ద ఆ ఫైల్ ఉంటుందో సామాన్యులకు తెలియదు. అందుకే ఎన్‌ఓసీ సర్టిఫికెట్‌కు ఉన్న విలువ జిల్లాలో ఏ సర్టిఫికెట్‌కూ లేదు. ఒక్కో ఫైల్ రూ.5లక్షల నుంచి రూ.50లక్షల వరకు పలుకుతోందని సమాచారం. ఆ భూమి ధర ఆధారంగా వారి రేటు నిర్ణయిస్తారని తెలుస్తోంది. ఈ విషయాల్లో మధ్యవర్తులతోనే పనులు జరుగుతాయని సమాచారం. కొందరు తహసీల్దార్లు నేరుగా బేరాలు కుదుర్చుకుంటారని తెలిసింది. జిల్లాలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, గుత్తి, అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో 400 నుంచి 700 వరకు ఫైల్స్ పెండింగ్‌లో ఉంటున్నట్లు సమాచారం. మిగిలిన 25 మండలాల్లో ఒక్కో మండలంలో 200 నుంచి 300 వరకు ఉంటున్నట్లు తెలిసింది.

చెక్‌లిస్టులో మార్పులెందుకు...?

ఎన్‌ఓసీ కోసం చుక్కల భూములు, 22ఏ భూములకు సంబంధించి ఫైల్స్ తయారుచేసే విషయంలో తరచూ మార్పులు జరగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాటి చెక్‌లిస్టులో తరచూ మార్పులు చేయమనడంపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గత కొంతకాలంగా చెక్‌లిస్టులో మార్పులు చేయడం విమర్శలకు తావిస్తోంది. సబ్‌డివిజన్ చేసిన డాక్యుమెంట్స్ పొందుపరచాలని ఆదేశించారని సమాచారం. దీంతో వాటిని పంపడంలో మరింత ఆలస్యమవుతోంది. ఇలా మొత్తంపై ఎన్‌ఓసీ ప్రక్రియ ఓ ప్రహసనంగా మారుతోంది. మరి అధికారుల్లో ఎప్పుడు మార్పొస్తుందో..? ఆ భూములకు ఎన్‌ఓసీ మోక్షం ఎప్పుడొస్తుందో...?కాలమే సమాధానం చెప్పాలి.

ఊరి బడి ఉసూరు..!

(3వ పేజీ తరువాయి)

ప్రభుత్వం 117 జీఓను రద్దు చేసింది. కొత్తగా మోడల్ ప్రాథమిక విద్యావిధానాన్ని తీసుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 9,600 మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసింది.

222 ఏకోపాధ్యాయ పాఠశాలలు

శ్రీసత్యసాయి జిల్లాలో 32 మండలాలున్నాయి. 29 మండలాల్లో 222 సింగిల్ టీచర్ పాఠశాలలు ఉన్నాయి. అధికంగా అమడగూరు మండలంలో 19, తనకల్లు 18, కదిరి, ఓబుళదేవరచెరువు 15, మడకశిర, ముదిగుబ్బ 10, గోరంట్ల, నల్లచెరువు 9, నంబులపూలకుంట, చిలమత్తూరు 8, తాడిమర్రి, గాండ్లపెంట, రొళ్ల 7, బత్తలపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి, ధర్మవరం మండలాల్లో 6 సింగిల్ టీచర్‌పాఠశాలలు ఉన్నాయి. వీటిలో విద్యార్థులేలేని పాఠశాలలు 10 ఉన్నాయి. 10 మంది విద్యార్థులు ఉన్నవి పది ఉన్నాయి. 1 నుంచి 10 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 196 ఉన్నాయి. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్లే ప్రభుత్వ పాఠశాలలకు గడ్డుకాలం వచ్చిందని ఉపాధ్యాయ నేతలు మండిపడుతున్నారు.

క్లస్టర్ టీచర్లకు కష్టాలు

ప్రభుత్వం జిల్లాలో 120 క్లస్టర్ పాఠశాలలను ఏర్పాటు చేసింది. డీఈఓ పూల్ కింద ఉన్న తెలుగు స్కూల్ అసిస్టెంట్లను క్లస్టర్ ఉపాధ్యాయులుగా నియమించింది. వీరికి విధివిధానాలను ఇప్పటికీ ప్రకటించలేదు. దీంతో క్లస్టర్ ఉపాధ్యాయులకు కొత్త కష్టాలు ఎదురవుతున్నాయి. ఉపాధ్యాయుల బదిలీలకు ముందు క్లస్టర్ పోస్టులు ఏర్పాటు చేస్తామనీ, ఇందులో నియమితులైనవారు.. క్లస్టర్ పరిధిలో ఉన్న టీచర్ సెలవు పెడితే.. ఆయా పాఠశాలలకు వెళ్లాలని సూచించారు. ఒక క్లస్టర్ పరిధిలో 10 ఉంచి 20 పాఠశాలలు ఉంటాయి. ఒక క్లస్టర్‌కు ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులను నియమించారు. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖాధికారులు ఓ ఉత్తర్వును విడుదల చేశారు. ప్రార్థన సమయానికి క్లస్టర్ ఉపాధ్యాయుడు బయోమెట్రిక్ వేయకపోతే గైర్హాజరు కింద పరిగణించి, ఆ రోజు జీతం కూడా చెల్లించకూడదని స్పష్టం చేశారు. దీంతో ఎప్పుడు ఏ పాఠశాలకు వెళ్లాలో, ఏ సబ్జెక్టు బోధించాలో తెలియక క్లస్టర్ ఉపాధ్యాయులు తికమక పడాల్సి వస్తోంది.

ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం



ఒకే ప్రాంతంలో ఫౌండేషన్, 1 నుంచి 10వ తరగతి వరకు ఉండడంవల్ల ఫౌండేషన్ పాఠశాల్లో విద్యార్థులు చేరడంలేదు. దీంతో ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. సమస్యను అధిగమించాలంటే గ్రామీణ ప్రాంతాల్లో 1 నుంచి 5 వరకు బేసిక్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాలంటే కామన్ స్కూల్ సిస్టమ్‌ను అమలు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకే రకమైన సిలబస్‌ను ప్రవేశపెట్టాలి.

-చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీటీఎఫ్

సింగిల్ టీచర్ స్కూళ్ల బలోపేతానికి కృషి చేస్తాం

సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సింగిల్‌టీచర్ ఉన్న పాఠశాలల బలోపేతానికి కృషిచేస్తున్నాం.గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పాలంటూ అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలలో 5 సంవత్సరాలు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోచేర్పేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలు మూత పడకుండా గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- కిష్టప్ప, డీఈఓ

ప్రజలే.. వైసీపీని రప్పా రప్పా ఆడించారు..

ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ఆర్థిక ఇబ్బందులున్నా హామీలు అమలు చేస్తున్నాం: ఎంపీ బీకే

పనులు చేసి.. ప్రతి ఇంటికీ ధైర్యంగా వెళ్తున్నాం: ఎమ్మెల్యే సునీత



కనగానపల్లిలో ప్రజలతో సెల్ఫీ దిగుతున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

కనగానపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ప్రజలే.. వైసీపీని రప్పా రప్పా ఆడించి పదకొండుకు పరిమితం చేశారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి చేస్తామని చెప్పాల్సిన వైసీపీ నాయకులు ఎక్కడ మాట్లాడినా 'రప్పా రప్పా, చీకట్లోనే ముగించేయాలి' అంటూ వాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో కనగానపల్లిలో ఆదివారం చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పాల్గొన్నారు. ముందుగా బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై నాయకులు ఆరాతీశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజలకిచ్చిన హామీలు కొన్ని అమలు చేశామనీ, రాబోవు కాలంలో మరిన్ని చేస్తామన్నారు. కరువు జిల్లాగా పేరుగాంచిన అనంతపురం నారా చంద్రబాబునాయుడు కృషితో పారిశ్రామిక, హార్టికల్చర్ హబ్‌గా మారిందన్నారు. త్వరలోనే రామగిరి బంగారు గనులు తెరిపించి, ఉపాధి కల్పిస్తామన్నారు.

అనంతరం ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా పనులు చేపడుతున్నారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. రాప్తాడులో రిజర్వాయర్ల ఏర్పాటుతోపాటు రామగిరి బంగారు గనులు తెరిచేలా చర్యలు తీసుకోవాని మంత్రి దృష్టికి తెచ్చారు. అంతకుముందు మంత్రి బెంగళూరు నుంచి రోడ్డుమార్గాన వస్తూ చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టులో ఆగారు. ఎక్సైజ్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. మద్యం అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, డీసీఎంఎస్, రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్ చౌదరి, మండల కన్వీనర్ యాతం పోతులయ్య, సర్పంచ్ అంకే పరిమళ, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, తెలుగు యువత సురేష్‌చౌదరి పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కోశాధికారిగా తిరుపాలయ్య



ఉరవకొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కోశాధికారిగా వజ్రకరూరు మండలం గూళ్యపాల్యం గ్రామానికి చెందిన డీలర్ తిరుపాలయ్య ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి రేషన్‌డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్ల సమస్యలపై తనవంతుగా పోరాడతానన్నారు.

నవ వరుడు ఆత్మహత్య



రమేష్ నాయుడు (ఫైల్)

గార్లదిన్నె, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.. రెండు నెలలు కాకుండానే నవదంపతుల మధ్య చిన్నపాటి మనస్పర్థలు తలెత్తాయి.. ఇంతలో క్షణికావేశంతో నవ వరుడు ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన చోటు చేసుకుంది. గార్లదిన్నె మండలంలోని తిమ్మంపేట సమీపంలో ఆదివారం సాయంత్రం రమేష్‌నాయడు (30) అనే నవ వరుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లికి చెందిన రమేష్‌నాయుడు అనే యువకుడు కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. రెండు నెలల క్రితం అనంతపురం పట్టణ సమీపంలోని లేపాక్షి నగర్‌కు చెందిన మానస అనే యువతితో ప్రేమ వివాహమయింది. ఇటీవల దంపతుల మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో మానస పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపం చెందిన చెందిన రమేష్‌నాయుడు ఆదివారం సాయంత్రం తిమ్మంపేట సమీపంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వాతంత్ర్య పోరాటతత్వాన్ని భవిష్యత్తు తరాలకు ఇవ్వడం హర్షణీయం

సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాల్ గౌడ్

భారతీయ ముస్లిం లెజెండ్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ గోపాల్‌గౌడ్, గజల్ శ్రీనివాస్ తదితరులు

హిందూపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటతత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందివ్వడం హర్షణీయమని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ గోపాల్‌గౌడ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన 'భారతీయ ముస్లిం లెజెండ్' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ న్యాయమూర్తి మాట్లాడుతూ.. దశాబ్దాలపాటు కృషిచేసి 150 మంది ముస్లిం లెజెండ్స్‌కు పుస్తక రూపంలో ఇవ్వడం గొప్ప విషయమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది ముస్లింలు పోరాటాలు చేశారన్నారు. వారి పోరాటాలను ఓ పుస్తక రూపంలోకి తీసుకొచ్చి భవిష్యత్తు తరాలకు తెలియజెప్పడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. గాయకుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న ముస్లింల చరిత్రను వెలికితీసి పుస్తక రూపంలో ఇవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ న్యాయమూర్తి.. స్వాతంత్ర్య సమరయోధుడు మెళవాయిగోవిందరెడ్డికి పుస్తకాన్ని అందజేశారు. పుస్తకాన్ని తన తల్లికి అంకితం ఇస్తున్నట్లు రచయిత ఉమర్ ఫారూక్ పేర్కొన్నారు. అనంతరం సాహితీవేత్తలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం నాయకులు జాబిలి చాంద్‌బాషా, కళారత్న బిక్కికృష్ణ, విద్యాధర్‌రావు, డా.ఉమర్‌అలీషా, అనంతరాముడు, మహేష్, మున్సిపల్ కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత జీవితం

- జిల్లా స్పెషల్ కోర్టు న్యాయాధికారి శివశంకర్



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న జిల్లా స్పెషల్ కోర్టు న్యాయాధికారి, చైర్‌పర్సన్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): విద్యతోనే జీవితాన్ని ఉన్నత స్థానాల్లో నిలుపుకుని, ఆత్మగౌరవంతో బతకొచ్చని జిల్లా స్పెషల్ కోర్టు న్యాయాధికారి శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో రజక ఉద్యోగ విద్యావంతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి అధ్యక్షతన ప్రతిభ కనబరిచిన రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా స్పెషల్ కోర్టు న్యాయాధికారి శివశంకర్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రజకుల్లో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పులు వస్తుండడం శుభపరిణామం అన్నారు. రజకులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో వృత్తి నుంచి విముక్తి పొంది సమాజంలో తలెత్తుకుని తిరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఏపీ రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ.. ప్రతి రజకుడు తమ పిల్లలను కచ్చితంగా చదివించాలని, ఆత్మగౌరవంతో జీవించాలని తెలిపారు. నమ్మకానికి, విశ్వాసానికి, శ్రమకు రజకులు ప్రతిరూపంగా నిలుస్తున్నారని అన్నారు. అంతకు ముందు మడివాళ మాచిదేవి, ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 51మంది రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రజక కార్పొరేషన్ డైరెక్టర్లు ఎస్‌సీ పరమేశ్వర్, రామాంజనేయులు, బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు, రజక సంఘం కృష్ణ, బీజేపీ నాయకులు ఆనంద్, బయన్న, రజక నాయకులు నాగరాజు, పద్మావతి, శివప్ప పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.31

అనంతపురంరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్టంగా రూ.31తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. ఆదివారం మార్కెట్‌కు 1950 టన్నుల టమోటా కాయలు వచ్చాయని పేర్కొన్నారు. అదేవిధంగా టమోటా కిలో కనిష్ట ధర రూ.13, సరాసరి ధర రూ.20తో విక్రయాలు జరిగాయని వివరించారు.

మంత్రి లోకేశ్‌తో విద్యావ్యవస్థ పటిష్ఠం

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్
- ఆర్ట్స్ కళాశాలలో తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ


తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

అనంతపురంరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో విద్యా వ్యవస్థ మరింత పటిష్ఠంగా తయారవుతోందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో రూ.1.29కోట్ల వ్యయంతో నూతన తరగతి గదుల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేపట్టారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేశారు.అనంతరం మాట్లాడుతూ..50ఏళ్లగా ఇక్కడ షెడ్డు ఉండేదని, ఈ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌కు విజ్ఞప్తి చేశానని తెలిపారు. ఆయన తరగతుల నిర్మాణానికి రూ.1.29కోట్లు, హాస్టల్ భవనాల కోసం రూ.2.45కోట్లు మంజూరు చేశారని తెలిపారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన కళాశాలకు ఆడిటోరియం లేదని తమ దృష్టికి వచ్చిందని, ఈవిషయాన్ని కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, అధ్యాపకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా స్థానిక నాయక్‌నగర్‌లోని స్మాష్ అకాడమీలో నిర్వహిస్తున్న జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీలు ఆదివారం ముగిశాయి. ముఖ్య అతిథి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు ప్రోత్సాహమందిస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన క్రీడా పాలసీ అటు క్రీడలు, ఇటు క్రీడాకారులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు. విజేతలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, జయకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

శుద్ధజల ప్లాంటు ప్రారంభం


ప్లాంటును ప్రారంభిస్తున్న న్యాయవాది ప్రతాప్‌రెడ్డి

రామగిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరులో గల మహాత్మాజ్యోతిబా బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు సాహితి గగన్ మహల్ ట్రస్టు వారు శుద్ధ జల ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. రూ.1.70లక్షల విలువ కలిగి వెయ్యిలీటర్ల సామర్థ్యం ఉన్న ఈ ప్లాంటును కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కింద కాంటినెంటల్‌కాఫీ లిమిటెడ్ హైదరాబాద్ వారు వితరణ చేశారు. సాహితీ గగన్ మహల్ ట్రస్టు అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్ రెడ్డి ఈ ప్లాంటును పాఠశాలలో ఏర్పాటు చేసి ప్రారంభించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఈ ట్రస్టుఎంతో కృషి చేస్తోందని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.18 లక్షలు

అనంతపురంరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశులసంతతో మార్కెట్‌కు రూ.3,18,300 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,69,300, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,49,000 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు నిధుల మంజూరు

రాప్తాడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగినేపల్లిలో గల చెన్నకేశవస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు రూ. 65 లక్షల 60 వేలు మంజూరు చేసినట్లు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గ్రామస్థులు, స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత ఆలయ జీర్ణోద్ధరణకు నిధులు మంజూరు చేయాలని కోరడంతో సర్వశ్రేయో నిధి నుంచి మంజూరు చేసినట్లు మంత్రి ప్రకటనలో పేర్కొన్నారు.

రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన ఎస్టీయూ నేతలు


రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌తో ఎస్టీయూ నేతలు

అనంతపురం విద్య, జూలై 20 (ఆంధ్ర జ్యోతి): ఏపీ రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్, న్యాయవాది సావిత్రిని ఎస్టీయూ నాయకులు కలిశారు. ఆమె ఆదివారం అనంతపురం నగరానికి రావడంతో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లాప్రధానకార్యదర్శి రామాంజనేయులు, నాయకులు గండికోట నారాయణస్వామి, రాజశేఖర్, సూర్యుడు, మల్లికార్జున తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. టీచర్ల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

జాబ్‌మేళాకు అనూహ్య స్పందన

అనంతపురం అర్బన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా సీడాప్ ఆధ్వర్యంలో మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సోలార్ సంస్థలో ఉద్యోగాల కోసం నిర్వహించిన జాబ్‌మేళాకు నిరుద్యోగల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన జాబ్ మేళాకు 650 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. సోలా ర్ సంస్థలో సీనియర్ మేనేజర్ లేదా మేనేజర్, ప్రాజెక్టు మేనేజర్, సీనియర్ ఇంజనీర్ లేదా ఇంజనీర్, సూపర్ వైజర్లు, టెక్నీషియన్లు, ఫీల్డ్ ప్లానింగ్, ఆపరేటర్స్, లైజనింగ్ అండ్ ఎక్విజిషన్, మెయింటెనెన్స్ ఓఅండ్ఎం పోస్టుల కోసం బీటెక్, డిప్లొమా అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. అకౌంట్స్, హెచ్‌ఆర్ పోస్టుల కోసం ఎంబీఏ అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇందులో 180 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, సీడాప్ జిల్లా మేనేజర్ సూర్యనారాయణ, సిబ్బంది నారాయణస్వామి, తులసిరామ్, జీవన్, వెంకటేష్, మెగా హెచ్‌ఆర్ బృందం సభ్యులు శ్రావణ్, రూబీ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


జాబ్ మేళాకు హాజరైన యువకులు

కష్టపడిన కార్యకర్తలందరికీ న్యాయం చేస్తాం

- ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

రాప్తాడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడిన కార్యకర్తలందరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రాప్తాడులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఇందులో మంత్రితో పాటు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీ బీకేపార్థసారధి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. అక్రమ కేసులు పెట్టినా పార్టీకోసం ఎంతో కష్టపడ్డారన్నారు. వారి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి తప్పక న్యాయం చేస్తామని తెలిపారు. అలాగే 2014-19 వరకూ జరిగిన పనుల పెండింగ్ బిల్లుల గురించి, ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో జరిగిన అవినీతి గురించి, నూతన రేషన్ కార్డుల నమోదులో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. అదేవిధంగా నడిమి వంక రక్షణ గోడ, హంద్రీనీవా ప్రాజెక్టు పనులు, భూములిచ్చిన రైతులకు పరిహారం, నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో సోలార్ ఏర్పాటు, సీకేపల్లి, పులేటిపల్లి, నాగసముద్రం గ్రామాల మధ్య 4వేల ఎకరాల బీడు భూముల్లో హార్టికల్చర్ హబ్ లేక సోలార్ హబ్ ఏర్పాటు గురించి మాట్లాడారు. అనంతరం పరిటాల సునీత మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ శ్రేణులకు ప్రభుత్వ పథకాలు అందకుండా కక్ష రాజకీయాలు చేశారన్నారు. వీటిని పరిశీలించాలని మంత్రిని కోరారు. ఎంపీ పార్థసారధి మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీకి బలమైన కేడర్ ఉందన్నారు. పార్టీ ఆదేశాల ప్రకారం ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ టీడీపీ శ్రేణులు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆరు మండలాల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం..

రామగిరి: మంత్రి కొల్లురవీంద్ర ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనేందుకు కనగానపల్లి మండలానికి వచ్చారు. దీంతో రామగిరి మండలానికి చెందిన బెస్తసేవాసంఘం నాయకులు పేపర్‌శీన, పేరూరు మల్లికార్జున తదితరులు ఘన స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించారు. అలాగే ఎమ్మెల్యే పరిటాలసునీత, ఎంపీ పార్థసారధిని కూడా సన్మానించారు.

అభివృద్ధి పనుల ప్రారంభం..

కనగానపల్లి: సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమానికి గాను మండలకేంద్రానికి వచ్చిన మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బీకే పార్థసారధి, ఎమ్మెల్యే పరిటాల సునీత పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. తొలుత బీసీ కాలనీలో సీసీరోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే శివాలయం వద్ద కమ్యూనిటీ భవన నిర్మాణానికి, భక్తకనకదాస కల్యాణమండపం నిర్మాణానికి భూమిపూజ చేశారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి పతకమూరి అంజి, మాజీ ఎంపీపీ ముకుందనాయుడు, సర్పంచులు, నాయకులు సోమర చంద్రశేఖర్, అంకే రామకృష్ణ, రాజాకృష్ణ, బిల్లే దాము, కసమూర్తి వెంకటేష్, సరిపూటి బాలయ్య, చల్లా బాలకృష్ణ, సోము, టీసీ సుబ్రమణ్యం, అంకే వన్నూరప్ప, నరేంద్ర, వడ్డే నాగభూషణం, పోతలయ్య, సంజీవరాయుడు, ప్రతాప్ పాల్గొన్నారు.


వేణుగోపాల్‌నగర్‌లో కొలువుదీరిన పీర్లు


కృష్ణంరెడ్డిపల్లిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


రాప్తాడులో పీర్ల గుండం వద్ద గ్రామస్థులు

భక్తి శ్రద్ధలతో పెద్దసరిగెత్తు

అనంతపురం టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేణుగోపాల్ నగర్‌లో గల 80 అడుగుల రోడ్డులో చిన్నపీర్ల పండుగ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పెద్దసరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బీబీ ఫాతిమా, అల్లావలి, అంగార్‌వలి, ఇమామ్ హసేన్, ఇమామ్ హుసేన్ పీర్లను భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని చక్కెర చదివింపులు చేసి, పానకాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కందుకూరి నాగరాజు, ఉపాధ్యక్షుడు జెబీవుల్లా ఖాన్, కార్యదర్శి మొహమ్మద్ రఫీ, సభ్యులు వెంకటేష్, మాధవ, రామాంజనేయులు, అంజి, నగేష్, మోహన, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు

అనంతపురంరూరల్: మండలంలోని కృష్ణంరెడ్డిపల్లిలో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. జలధి సందర్భంగా ఉదయం ముజావర్లు పీర్లను గ్రామంలో ఊరేగించారు. అనంతరం అగ్నిగుండం ప్రవేశం చేయించారు. గ్రామస్థులు పెద్దఎత్తున చక్కెరచదివింపులు చేయించారు. తర్వాత సాయంత్రం ఊరేగింపుగా జలధికి తరలించారు. పిల్లలు, పెద్దలు అలావ్ తొక్కుతూ సందడి చేశారు.

●రాప్తాడు: మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని రాప్తాడు, హంపాపురం, పాలచెర్ల గ్రామాల్లో జలధి వైభవంగా నిర్వహించారు. ముజావర్లు తొలుత పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతర గ్రామంలో ఊరేగించి జలధికి తరలించారు.

గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవం


అమ్మవారికి సారె సమర్పించేందుకు ఊరేగింపుగా వస్తున్న భక్తులు,


శాకంబరి అలంకరణలో వేదమాత గాయత్రీదేవి

అనంతపురంటౌన్, జూలై20 (ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్‌బోర్డులోని వేదగాయత్రి ఆలయ 20వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాభిషేకం చేయడంతో పాటు వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో వేదపండితుడు సత్యనారాయణశర్మ నేతృత్వంలో అర్చకబృందం గణపతి, నవగ్రహ, శాంతి, రుద్రహోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. తర్వాత వెంకటేశ్వరస్వామి ఆలయ మహిళామండలి సభ్యులు మంగళవాయిద్యాల నడుమ సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. మహామంగళహారతి తర్వాత భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలూరు లక్ష్మీనరసింహశాస్త్రి, బ్రాహ్మణ వసతి గృహం అధ్యక్షుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, మురళీధర్, మల్లికార్జున, పాండురంగయ్య, రామసుబ్బారావు, పద్మావతి, దాక్షాయని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బుక్కరాయసముద్రం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ.కొత్తపల్లి గ్రామంలో గల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి కుమారుడు భరత్‌సింహా రెడ్డి (22) అనంతపురం రూరల్ పరిధిలోని తాటిచెర్ల వద్ద ఉన్న హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్‌లో ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కాగా గత శనివారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే బీ.కొత్తపల్లి గ్రామం వద్దకు రాగానే జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు..

గార్లదిన్నె: మండలంలోని తలగాసిపల్లి జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. అనంతపురం రూరల్ పరిధిలోని సిండికేట్ నగర్‌కు చెందిన గోవిందు, పరమేష్ బైక్‌పై గుత్తి నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. తలగాసిపల్లి జంక్షన్ వద్దకు రాగానే ముందు వెలుతున్న వ్యాన్‌ను ఢీ కొట్టారు. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఉన్న తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వవిద్యార్థులు

శింగనమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. పాఠశాలలో 1997-98వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్లకు అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తర్వాత నాటి గురువులను శాలువాలు, పూలమాలతో సన్మానించారు.

వర్షం కోసం బొడ్రాయికి పూజలు


బొడ్రాయికి జలాభిషేకం ప్రజలు

పామిడి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నీలూరులో వర్షం కురవాలని గ్రా మంలోని అన్ని దేవాలయాల్లో ఆదివారం గ్రామస్థులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బొడ్రాయికి 101 కొబ్బరికాయలు కొట్టి .. 101 బిందెలతో జలాభిషేకం చేశారు.

వైభవంగా గంగమ్మ జాతర


బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, చిన్నారులు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

అనంతపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శనగర్‌లో గల గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం అమ్మవారి జాతరను కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ఉరుముల వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయంలో అర్చకులు గంగమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల మూలవిగ్రహాలను సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి, చందనం, సింధూరం, పట్టువస్త్రాలు, వేపమండలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి చెరకు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బెస్త సంఘం గౌరవాధ్యక్షుడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

అనంతపురం విద్య, జూలై 20(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో మెలిగినప్పుడే విజయాన్ని సులభతరంగా సాధించవచ్చని డీఎస్పీ మహబూబ్ బాషా సూచించారు. నగరంలోని అరవిందనగర్‌లో గల బీసీబాలికల వసతిగృహంలో ఆదివారం బాలికల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుంటే మంచి ఫలితాలు సాధించడంతో పాటు ఉన్నతస్థాయికి ఎదుగుతారని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతోనమ్మకంతో హాస్టల్‌కు పంపి చదివిస్తున్నారని, వారినమ్మకాన్ని నిలబెట్టాలని తెలిపారు. మరోఅతిథి డాక్టరు శంషాద్‌బేగం మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బీసీసంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి, జర్నలిస్టు రామాంజినేయులు, వార్డెన్లు పాల్గొన్నారు.

మాజీ సైనికుల ఇంటి పట్టాలకు 400 దరఖాస్తులు


అర్జీలు స్వీకరిస్తున్న మాజీ సైనికులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టాలు, పక్కా ఇళ్ల కోసం 400 మంది మాజీ సైనికులు, వీరనారీమణులు దరఖాస్తులు అందజేశారు. ఆదివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని వీకే భవన్‌లో మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న అధ్యక్షతన జిల్లా మాజీ సైనికుల సంఘం సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 400 మంది మాజీ సైనికులు, వీరనారీమణుల నుంచి ఇంటి పట్టాలకు అర్జీలు స్వీకరించారు. మాజీ సైనికులు, వీరనారీమణులకు ప్రభుత్వం ఇంటిపట్టాలు అందజేస్తుందని షేకన్న తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, నాయకులు కుమారస్వామి, శివశంకర్, ఈశ్వరయ్య, నాగిరెడ్డి, రంగారెడ్డి, నాగరాజు, హుస్సేన్, బాలస్వామి, మహ్మద్‌గౌస్, సంజీవకుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి నషాముక్త్ భారత్ సదస్సులో జిల్లా యువత



నషాముక్త్ భారత్‌లో జిల్లా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): దేశ ఆధ్యాత్మిక రాజధాని వారణాసిలో గత మూడు రోజులుగా నిర్వహించిన జాతీయ స్థాయి నషాముక్త్ భారత్ సదస్సులో జిల్లాకు చెందిన యువకులు పాల్గొన్నారు. కేంద్ర క్రీడా, యువజన శాఖ మంత్రి మాన్‌సిక్ మాండవీయ, సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ శిబిరంలో జిల్లా నుంచి మై భారత్ ఏపీ కోఆర్డినేటర్ బిసాటి భరత్, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జయమారుతి, ఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు సుంకర రమేష్, కార్యదర్శి రఘు, రాయల్‌రంగ, ఆ నలుగురు సేవాసమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్ ప్రాతినిధ్యం వహించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు వాడకం వలన వచ్చే నష్టాలు, పరిణామాలపై సదస్సులో వివరించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఉద్యాన పథకాలను వినియోగించుకోండి

- ఉద్యానశాఖ అధికారి దివ్య



రాప్తాడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలను అర్హత గల రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ మండల అధికారిణి దివ్య సూచించారు. ఆంధ్రజ్యోతి ఆమెను ఇంటర్వ్యూ. పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న: రాప్తాడు మండలంలో రైతులు ఎంత విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.?

జవాబు: 3,673 ఎకరాల్లో పలు రకాల ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.

ప్రశ్న: ఏఏ పంటలకు సబ్సిడీ ఇస్తారు?

జవాబు: మామిడి, జామ, దానిమ్మ, సీతాఫలం, సపోటా, రేగు, ద్రాక్ష, టిష్యూకల్చర్ అరటి, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, అంజూర, ఫ్యాషన్ ఫ్రూట్, ఉసిరి, నేరేడు, చింత, పట్నాఫ్రూట్, హైబ్రీడ్ కూరగాయలసాగు, పుట్టగొడుగుల పెంపకం తదితరాలకు రాయితీ ఇస్తాము.

ప్రశ్న: సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు ఇస్తారా?

జవాబు: మినీ ట్రాక్టర్, పవర్ టిల్లర్, తైవాన్ స్ప్రేయర్లు అందజేస్తాం.

ప్రశ్న: ఉద్యాన పథకాల సబ్సిడీ కోసం ఎక్కడ సంప్రదించాలి?

జవాబు: అర్హత కలిగిన పండ్ల తోటల రైతులు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లను, హెచ్‌ఓలను కలవాలని, లేదంటే ఉద్యానశాఖ కార్యాలయాల్లో కూడా సంప్రదించవచ్చు.

హోంమంత్రి పర్యటనను అడ్డుకుంటాం: వైసీపీ

అనంతపురం కలెక్టరేట్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత పర్యటనను అడ్డుకుంటామని వైసీపీ నాయకులు హెచ్చరించారు. అత్యాచార బాధిత బాలికను పరామర్శించేందుకు ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, ఎస్సీ సెల్ నగరాధ్యక్షుడు పసలూరి ఓబుళేసు, మహిళా విభాగ నేతలు ఆదివారం వెళ్లారు. పోలీసులు అడ్డుకోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రానికి హోంమంత్రిగా ఉన్న అనిత దళితురాలైనా తమ వర్గానికి న్యాయం జరగడం లేదన్నారు. బాధిత బాలికను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అడ్డుకోవడం దారుణమన్నారు. బాలికను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం మడకశిర పర్యటనకు వస్తున్న హోంమంత్రిని అడ్డుకుంటామన్నారు. ఆందోళన చేస్తున్న నాయకులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లాధ్యక్షుడు, శ్రీనివాసబాబు నాయక్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, నాయకులు సాకేశ్రీనివాసులు, సాకేచంద్రలేఖ, దాదాఖలందర్ తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులు

దుర్గం అభివృద్ధికి వైసీపీ అడ్డు

- తలారి రంగయ్య మాస్టర్ ప్లాన్
- మున్సిపల్ చైర్మన్ సాయంతో చీకటి రాజకీయాలు
- కౌన్సిల్ సమావేశం జరగకుండా కుట్రలు
- నిలిచిపోయిన రూ.8.25 కోట్ల నిధులు
- నేడు కౌన్సిల్ సమావేశం సాగేనా..?

కళ్యాణదుర్గం, జూలై 20(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం అభివృద్ధికి వైసీపీ నాయకులు అడ్డుపడుతున్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎంపీ తలారి రంగయ్య మాస్టర్ ప్లాన్‌ను మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైసీపీ కౌన్సిలర్లు తూచా తప్పకుండా అమలు చేస్తూ.. అభివృద్ధికి బ్రేక్‌లు వేస్తున్నారు. అనంతపురం, హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా తలారి రంగయ్య పనిచేసిన అనుభవం ఉంది. దుర్గం మున్సిపాలిటీ పరిధిలో 24 మంది కౌన్సిలర్లలో 13 మంది వైసీపీ, 11 మంది టీడీపీ వారు ఉన్నారు. దీంతో మున్సిపల్ చైర్మన్‌గా వైసీపీ కౌన్సిలర్‌నే ఎన్నుకున్నారు. కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు బలమే ఎక్కువగా ఉంటుంది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించకుండా తలారి రంగయ్య అడ్డుకట్ట వేస్తున్నారు. ప్రతి అభివృద్ధి పనికీ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. ఈ కౌన్సిల్ సమావేశం జరిగితే ఎక్కడ దుర్గం అభివృద్ధి చెందుతుందోనని వైసీపీ ప్రజాప్రతినిధులు ఆ సమావేశం జరగకుండా చీకటి రాజకీయాలకు పాల్పడుతున్నారు.

రెండు సార్లే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రెండు సార్లు (అక్టోబరు 2024, మే 2025) మాత్రమే కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆ తర్వాత ఇప్పటివరకు ఒక్కసారి కూడా కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదు. టీడీపీ కౌన్సిలర్లు బలం తక్కువగా ఉండడంతో వారు కూడా ఏమి చేయలేకపోతున్నారు. దీంతో బడ్జెట్ అంతా నిలిచిపోతోంది. రూ.8.25 కోట్లు నిధులు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలపకుండా ఆగిపోయింది. అభివృద్ధికి అడ్డుకట్టపడిపోయింది. మున్సిపల్ అధికారులు కూడా చేసేది ఏమీ లేక మిన్నకుండిపోతున్నారు. ఇక్కడ జరిగే విషయాన్ని మున్సిపల్ కమిషనర్ కలెక్టర్‌కు కూడా వివరించారు. ఈ మున్సిపాలిటీ జరిగే తతంగం అంతా ప్రభుత్వానికి నివేదికలు అందించే పనిలో అధికారులు నిమగ్నం అయ్యారు.

నేడు కౌన్సిల్ సమావేశం...

పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. దీనిపై మున్సిపల్ సిబ్బంది ద్వారా సమాచారం అందించినా వైసీపీ కౌన్సిలర్లు ఏ మాత్రం స్పందించడం లేదు. మరి మున్సిపల్ చైర్మన్, వైసీపీ కౌన్సిలర్లు వస్తారో...రారో... వేచి చూడాలి.



కళ్యాణదుర్గం మున్సిపల్ కార్యాలయం

నివేదికలు పంపుతాం



ప్రతి నెలా జరగాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరగడం లేదు. మున్సిపల్ కౌన్సిల్ తేదీని తెలపండి అని మున్సిపల్ చైర్మన్‌కు రిజిస్టరు పోస్టు చేసినా.. సమాధానం లేదు. ఆ పోస్టును వెనక్కి పంపించారు. రూ.8.25 కోట్లు నిధులు ఆమోదం తెలపకుండా ఆగిపోయాయి. ఇక్కడ జరిగే విషయాలపై ప్రభుత్వానికి ఆధారాలతో నివేదికలు పంపిస్తున్నాం.

- వంశీకృష్ణ భార్గవ్, మున్సిపల్ కమిషనర్, కళ్యాణదుర్గం

న్యూస్ బాక్స్

లాభాల బాటలో గుత్తి కోపరేటివ్ టౌన్ బ్యాంక్



మాట్లాడుతున్న టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్

గుత్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): గుత్తి కోపరేటివ్ టౌన్ బ్యాంక్ లాభాల బాటలో పయనిస్తోందని టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్ హల్‌లో నిర్వహించిన బ్యాంక్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బ్యాంక్ నెలకు రూ. 1.49 కోట్ల లాభాల్లో ఉందన్నారు. త్వరలో గుంతకల్లు, కదిరి, డోన్ పట్టణాల్లో బ్యాంక్ శాఖలు ప్రారంభిస్తామన్నారు. ఎఫ్ఎస్‌డబ్ల్యూఎం కింద త్వరలో రాయదుర్గంలో కూడా టౌన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభిస్తామన్నారు. అయితే బ్యాంక్ పట్ల తప్పుడు ప్రచారం చేస్తున్న సభ్యుడు సయ్యద్ షేక్షావలిని నిబంధనల మేరకు ఏపీ సహకార చట్టం సెక్షన్ 23 ప్రకారం అతని సభ్యత్వాన్ని తొలగించినట్లు సమావేశంలో తీర్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉపాధ్యక్షుడు రామ్మోహన్, డైరక్టర్లు నాగరాజు, కృష్ణ, వీరన్న, మధుసూధన్‌గుప్త, నాగరాజు, వెంకటేష్, బాబు, మహబుబ్, దాదా, రంగప్రసాద్, ప్రొఫెషనల్ డైరక్టర్ ఎంవీ మహేష్‌కుమార్, బీఓఎం చైర్మన్ సుధీర్‌బాబు, సభ్యులు వన్నప్ప, శ్రీనివాస్, సీఈఓ మహేశ్వర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

23న మండల సర్వసభ్య సమావేశం

బెళుగుప్ప, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

రేపు ద్విచక్రవాహనాల వేలం

తాడిపత్రి, జూలై 20(ఆంధ్రజ్యోతి):ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం కేసులోపట్టుబడిన ద్విచక్రవాహనాలను మంగళవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో బహిరంగ వేలం వేస్తామని ఎక్సైజ్ సీఐ నాయుడు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌కాపీలతో హాజరుకావాలన్నారు.

వర్షం కోసం పూజలు



బొడ్రాయికి నీళ్లు పోస్తున్న ప్రజలు

పామిడి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నీలూరులో వర్షం కురవాలని గ్రామంలోని అన్ని దేవాలయాల్లో ఆదివారం గ్రామస్థులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బొడ్రాయికి 101 కొబ్బరికాయలు కొట్టి .. 101 బిందెలతో నీళ్ల పోశారు.

పత్తి పంట తొలగింపు



ఎండిన పంటను చూపుతున్న రైతులు

పెద్దవడుగూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్షుంపల్లిలో రైతు పుల్లారెడ్డి సాగుచేసిన రెండు ఎకరాల్లోని పత్తి పంట ఎండిపోయింది. దీంతో ఆదివారం ఆ మొక్కలను తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. మరో పంటనైనా సాగుచేయాలని ఉద్దేశంతో ట్రాక్టర్‌తో పత్తిపంటను తొలగించారు.

పవర్ గ్రిడ్ అధికారి ఫిర్యాదు..

జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచరులపై కేసు

యాడికి, జూలై20(ఆంధ్రజ్యోతి): పవర్‌గ్రిడ్ అనంతపురం, కర్నూలు ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ హేమంత్‌కుమార్ మౌనస్ ఫిర్యాదు మేరకు అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు 40 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతపురం జిల్లా యాడికి సీఐ ఈరన్న తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాడికి మండలం రాయలచెరువు సమీపంలోని తూట్రాళ్లపల్లి వద్ద పవర్ గ్రిడ్‌కు సంబంధించిన ట్రాన్స్‌మిషన్ టవర్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు 40మంది ఈనెల 16న నిర్మాణ పనుల వద్దకు వచ్చి అడ్డుకున్నారు. పనులను పర్యవేక్షిస్తున్న ట్రాన్స్‌మిషన్ ఉద్యోగి అమిత్ యాదవ్‌ను వాహనంలో ఎక్కించుకుని, దుర్భాషలాడుతూ తీసుకెళ్లారు. జిల్లాలోని గుత్తి పట్టణంలో వదిలేశారు. పనులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పవర్‌గ్రిడ్ అనంతపురం, కర్నూలు ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ హేమంత్‌కుమార్ మౌనస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 40మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సీఎస్ఆర్ ఫండ్ కోసమేనా?

అనంతపురం, కర్నూలు ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ సంస్థ తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో గ్రిడ్ నిర్మాణ పనులను చేపడుతోంది. తాడిపత్రిలో పైపులైన్ల ఏర్పాటు కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ఫండ్ కేటాయించాలని పనులు చేపడుతున్న సంస్థను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరినట్లు తెలిసింది. దీనిపై నివేదికను ఢిల్లీలోని ప్రధాన కార్యాలయానికి సంస్థ అధికారులు అందజేసినట్లు చర్చించుకుంటున్నారు. ట్రాన్స్‌మిషన్ టవర్ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నా.. సీఎస్ఆర్ ఫండ్ విడుదల చేయకపోవడంపై జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది. నియోజకవర్గ పరిధిలో పనులు చేపడుతున్న కార్పొరేట్ సంస్థ తాడిపత్రి ప్రజల కనీస అవసరమైన తాగునీరు ఇచ్చేందుకు సీఎస్ఆర్ ఫండ్‌ను ఎందుకు ఇవ్వరనేది స్థానికుల వాదన.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

కూడేరు/బెళుగుప్ప, జూలై 20(ఆంధ్రజ్యోతి): కూడేరు మండలంలో 11 మందికి 9,68,283, బెళుగుప్ప మండలంలో పది మందికి 4,61,684 సీఎం సహాయ నిధి మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను అనంతపురం పట్టణంలోని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ క్యాంపు కార్యాలయంలో టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు బాధితులకు అందజేశారు. తమను ఆదుకునేందుకు చొరవ చూపిన మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



చెక్కులను అందజేస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: జనసేన



మాట్లాడుతున్న జనసేన నాయకుడు వాసగిరి మణికంఠ

గుంతకల్లు/టౌన్ జూలై 20(ఆంధ్రజ్యోతి): పార్టీ నియమావళిని అతిక్రమిస్తే సంస్థాగతంగా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని జనసేన గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త వాసగిరి మణికంఠ హెచ్చరించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. పార్టీలోని వక్కల ఉమ, పూల రమణ, మరి కొందరు అనుచితంగా మాట్లాడారన్నారు. పార్టీ తనకు ఒక బాధ్యతాయుతమైన పదవిని ఇచ్చిందని తెలిసి కూడా తన ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యాఖ్యలు చేశారన్నారు. తాను వచ్చిన అందరినీ కలుపుకుని పోతున్నానన్నారు. తనపై వ్యాఖ్యలకు చేసినందుకు నోటీసును ఇచ్చానన్నారు. ఇకపై పార్టీ నిబంధనలను అతిక్రమిస్తే సంస్థాగతంగా చర్యలు తప్పవని అధిష్టానం వెల్లడించిందన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు ధనుంజయ, బండి శేఖర్, పాటిల్ సురేశ్, పవర్ శేఖర్, బోయగడ్డ బ్రహ్మయ్య, పాండు కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా గ్రామాలు

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు



బ్రహ్మసముద్రంలోని చెత్త కేంద్రం

బ్రహ్మసముద్రం, జూలై 20(ఆంధ్రజ్యోతి): గ్రామాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. గ్రామాల్లో చెత్తను తొలగించడంతో పాటు.. దానితో సంపద సృష్టించడానికి గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన కేంద్రాలు నేడు నిరుపయోగంగా మారాయి. వాటి నిర్వహణ బాధ్యతను పంచాయతీ అధికారులు అప్పగించగా.. వారు తమకేమీ పట్టనట్లు వాటిని గాలికి వదిలేయడంతో ఈ దుస్థితి నెలకొంది. ఎమ్మెల్యే, జిల్లా స్థాయి అధికారులు వచ్చినప్పుడు మాత్రం నామమాత్రంగా అధికారులు చెత్త సేకరించి వారితో భేష్ అనిపించుకొంటున్నారు. తర్వాత ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చెత్తను సేకరించాల్సిన క్లాప్‌మిత్రలు గ్రామాల్లో చెత్త సేకరించకుండా ఎక్కడికక్కడే వదిలేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు జూదరులకు నిలయాలుగా మారాయి.

పలు పోస్టులు ఖాళీ..: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న రంగనాయకులకు ఎంపీడీఓ, ఎఫ్ఏసీ బాధ్యతలతో కళ్యాణదుర్గం ఈఓఆర్డీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్ని విధులను నిర్వహించడంలో ఆయన బిజీగా ఉండటంతో.. కింది స్థాయి అధికారులు చేసే పనులను పర్యవేక్షించే తీరిక లేకుండా పోయింది. దీంతో మండల ప్రజా పరిషత్ కార్యాలయ పాలన దారి తప్పింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. దీనికి తోడు ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ నందకిషోర్ బదిలీపై వెళ్లడంతో ఆ పోస్ట్ ఖాళీ అయింది. ఇన్ని శాఖల అధికారులు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. ఈ సమస్యలు పరిష్కరించాలని మండల వాసులు కోరుతున్నారు.

దర్గాను అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, జూలై 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖమైన మస్తాన్ వలీ దర్గాను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం ఆయన తన కుమారుడు ఈశ్వర్, సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులుతో కలిసి స్వామివారి సన్నిధిలో ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ దర్గాకు ఘనమైన చరిత్ర, వార్షిక ఆదాయమున్నా అభివృద్ధికి నోచుకోలేకపోయిందన్నారు. ఈ విషయాన్ని వక్ఫ్ బోర్డు చైర్మన్‌తోనూ చర్చించానన్నారు. దర్గా అభివృద్ధి ప్రత్యేక చర్యలు తీకుంటానన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు బండారు ఆనంద్, గుణశేఖర్, రామన్న చౌదరి, ఫజులు, గుజరా ఖాజా, ఫ్రూట్ మస్తాన్, అంజి, చిప్పగిరి ప్రతాప్, మత్రు నాయక్, కోడి సీనా, అన్వర్ బాషా ఉన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు..

గుత్తిరూరల్: కొత్తపేటలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదివారం నిర్వహించారు. ఇందులో టీడీపీ పట్టణ, మండల కన్వీనర్లు బర్దీవలి, ఏంకే చౌదరి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, సింగల్ విండో ప్రెసిడెంట్, శివశంకర్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

50 రోజులు అవుతున్నా...

పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు



కూలిన ట్రాన్స్‌ఫార్మర్

బొమ్మనహాళ్, జూలై20(ఆంధ్రజ్యోతి): మండలంలో గత నెల మొదటివారంలో గాలీవానకు గోనేహాళ్ గ్రామ సమీపంలో వరసగా 10 విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. దీంతో నాటి నుంచి పలు పొలాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా ఆగిపోయింది. రెండు నెలలు అవుతున్నా అధికారులు అలాగే వదిలేశారు. పొలాలకు సంబందించిన ట్రాన్స్‌ఫార్మర్లు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సేద్యం పనులు ఊపందుకున్నాయని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మలు తిరిగి ఏర్పాటు చేయాలని అధికారులను కోరినా వారు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

కొత్తవి ఏర్పాటు చేస్తాం

గత నెలలో గాలీవానకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి వాటిని తొలగించాలని ఇప్పటికే లైన్‌మ్యాన్‌కు చెప్పాను. రెండు రోజుల్లో వాటిని తొలగించేందకు చర్యలు చేపట్టి.. కొత్తవి ఏర్పాటు చేసి రైతులకు విద్యుత్ సమస్య లేకుండా చేస్తాం

- లక్ష్మీరెడ్డి, విద్యుత్ ఏఈఈ, బొమ్మనహాళ్

అదునులో పదును



కుందుర్పి, జూలై 20(ఆంధ్రజ్యోతి): అదును కోసం విత్తన సాగుకు ఎదురుచూస్తున్న రైతులకు శనివారం సాయంకాలం వరుణదేవుడు కరుణించాడు. దీంతో రైతులు విత్తన వేరుశనగకు సన్నద్ధమయ్యారు. గత నెల నుంచి పొలాలను దుక్కిదున్ని చదును చేసుకున్నారు. వర్షం రాకతో విత్తన సాగుకు అదును కావడంతో దుక్కిదున్నడంలో రైతులు బిజీ అయ్యారు.




కూడేరు, ఎర్రగుడిలో జలధికి వెళుతున్న పీర్లు

ముగిసిన మొహర్రం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: కూడేరు మండలంలో మొహర్రం వేడుకలు మండలంలో ఆదివారంతో ముగిశాయి. మండలంలోని అరవకూరు, మరుట్ల 1వ కాలనీ, కూడేరు గ్రామాల్లో పీర్లస్వాములను తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం అనంతరం గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం జలధికి తరలించారు. బెళుగుప్ప మండలంలోని ఎర్రగుడి కొత్తకాలనీ, రామసాగరం గ్రామాల్లో పీర్ల స్వాములను ఆదివారం జలధికి తరలించారు. తాడిపత్రి మండలంలోని కోమలి గ్రామంలో 30 ఏళ్ల తర్వాత నిర్వహించిన పీర్ల పండుగ ప్రశాంతంగా జరిగింది. ఆదివారం నిర్వహించిన జలధి కార్యక్రమంలో ఆ గ్రామస్థులంతా పాల్గొన్నారు. బ్రహ్మసముద్రం మండలం చెలిమేపల్లిలో పీర్లను ఆదివారం సాయంత్రం జలధికి తరలిచారు.




కోమలి, చెలిమేపల్లిలో జలధికి వెళుతున్న పీర్లు

క్రైం న్యూస్..

గాయపడిన వ్యక్తి మృతి



అంజనేయులు (ఫైల్)

రాయదుర్గంరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెంచానపల్లి గ్రామ వాసి ఆంజనేయులు (40) ఆదివారం తెల్లవారుజామున మరణించాడు. ఇతను ఈనెల 16న కెంచానపల్లి గ్రామంలో చెరువు పక్కనే ఉన్న కాలువ గట్టు మీద వెళ్తూ.. ప్రమాదవశాత్తు జారి పడి గాయపడ్డాడు. మాట్లాడలేని స్థితిలో ఉన్న అతన్ని స్థానికులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక అతను మరణించాడు. ఇతను అవివాహితుడు. తల్లి చిన్న మారక్క ఉంది. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతూ...



చంద్రశేఖర్ మృతదేహం

బెళుగుప్ప, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన సీ చంద్రశేఖర్ (42) చికిత్స పొందుతూ కళ్యాణదుర్గం ఆస్పత్రిలో ఆదివారం మరణించాడు. ఈ నెల 17న వర్షం కురుస్తున్న సమయంలో ఇంటిపై గవాక్షిపై బండ వేయడానికి నిచ్చెన ఎక్కుతూ.. ప్రమాదవశాత్తు జారి పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతన్ని కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక ఆదివారం ఆయన మరణించాడు. చంద్రశేఖర్‌కు భార్య సువర్ణ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ శివ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తిరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఊబిచేర్ల గ్రామానికి చెందిన రవికుమార్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడాడు. కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన ఇతను ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యల్లనూరురోడ్డు సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని ఆదివారం అరెస్ట్ చేసి.. వారి వద్ద ఉన్న రూ.39,361 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ గౌస్ బాషా తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న మండలి సభ్యులు

గుంతకల్లుటౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతగుంతకల్లులోని శ్రీశైల జగద్గురు సూర్యసింహాసన మఠంలో ఆదివారం శ్రీశైల జగద్గురు సూర్యసింహాసన మఠం అభివృద్ధి మండలి సభ్యులు ఆధ్వర్యంలో శ్రావణ మాస పూజ కార్యక్రమాల కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల 25 నుంచి ఆగస్టు 23 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఆ మండలి సభ్యులు జీపీ తిమ్మారెడ్డి, జీపీ మంతకల్‌రెడ్డి, దేవేంద్రప్ప, సురేష్‌గౌడ్, బండారు రమేష్, మోహన్‌బాబు, వీరన్నగౌడ్, మేనేజర్ మల్లప్ప, సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాల్సిందే



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

పుట్లూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాల్సిందేనని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. పోలవరం ప్రాజెక్ట్ తొందరగా పూర్తిచేసి నీటి సమస్యలు పరిష్కరించాలన్నారు.

వైభవంగా గ్రామదేవర



అలంకరణలో అమ్మవారు

పెద్దపప్పూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాపురం గ్రామంలో గ్రామస్థులు అందరూ కలిసి పెద్దమ్మ తల్లి దేవరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది ఇందులో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

ఉరవకొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లకు ఒప్పందాలు చేసుకుని అదానీ సంస్థకు టెండర్లు కట్టబెట్టి భారీ కుంభకోణానికి పాల్పడిందన్నారు. అదానీ స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై అధిక భారం మోపేందుకు సిద్ధమవుతున్నారని, పాత మీటర్లనే కొనసాగిస్తూ, పాతరీడింగ్ పద్ధతినే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో సీపీఎం నాయకులు మధుసూధన్, రంగారెడ్డి, శీనప్ప, మురళి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

తాడిపత్రి, జూలై 20(ఆంధ్రజ్యోతి): సీపీఐ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా అనంతరం వచ్చే నెల 12, 13తేదీల్లో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజారెడ్డి కోరారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

శెట్టూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలో నేటి నుంచి బీ4 గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జిలానీ బాషా తెలిపారు. 21న అయ్యగార్లపల్లి కనుకూరు, చింతలపల్లి, యాటకల్లు, ఐదుకల్లు, 22న చెర్లోపల్లి, మాకొడికి, ఖైరేవు, లక్ష్మంపల్లి, బచ్చేహళ్లి, చిన్నంపల్లి, 23న అనంపల్లి, తిప్పనపల్లి, ములకలేడు, శెట్టూరు పెరుగుపాలెం గ్రామాల్లో పీ4 గ్రామసభలు నిర్వహిస్తున్నామని, మండల స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.